క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధికంగా తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు చేశారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీతం ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా పరదేశిమాంబ పండగ



పరదేశిమాంబను దర్శించుకుంటున్న ఎంపీపీ , వైఎస్సార్‌సీపీ నాయకులు

పరవాడ: పరవాడ గ్రామంలో కొలువుదీరిన పరదేశిమాంబ అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. వేకువ జాము నుంచి అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా కనకారావు, రెడ్డి శ్రీనివాసరావు, వర్రి హరి, పైల సురేష్, వర్రి పైడింనాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు.

2 కిలోల గంజాయి స్వాధీనం

పరవాడ: గంజాయి రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ ఎస్.సురేష్ తన సిబ్బందితో దాడి చేసి స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఒడిశాకు చెందిన సూరాడ జగదీష్ రవాణాకు సిద్ధంగా ఉంచిన 2 కేజీల 260 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

బయోమెట్రిక్ అటెండెన్స్ అమలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో డార్స్ అటెండెన్స్ పద్ధతి తొలగించి, బయోమెట్రిక్ అటెండెన్స్ (బార్స్) కొనసాగిస్తున్నారని స్టీల్‌ప్లాంట్ హెచ్ ఆర్ జీఎం కె.సంజీవరావు తెలిపారు. హెచ్‌ఆర్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన బయోమెట్రిక్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అయితే కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు బార్స్‌తో పాటు డార్స్ షీట్లు కూడా కొనసాగిస్తున్నామని చెప్పారు. డార్స్ షీట్లపై సంతకాలు చేసిన వారి హాజరు బార్స్ ద్వారా నమోదు చేస్తున్నారన్నారు. ఈ పద్ధతి ఎంత కాలం ఉంటుందనేది చెప్పలేమన్నారు. అందువల్ల ప్రతీ కార్మికుడు బార్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు హాజరు కూడా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు లేవనెత్తిన అనేక సందేహాలు, సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకు వెళతామని తెలిపారు. తదుపరి సమావేశాన్ని మార్చి 16కు వాయిదా వేశారు. జీఎం లలన్ కుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో హెచ్‌ఆర్ అధికారులు ఎస్.కె.ఖర్, వై.హెచ్.శంకర్, ఐటి డీజీఎం ఎస్.ప్రభాకర్ రామ్, 22 మంది కార్మిక నాయకులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

- అవినీతికి తావులేకుండా అందించాం
- వచ్చే ఎన్నికల్లో అధిక మెజారిటీతో గెలిపించండి
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ఘనంగా వైఎస్సార్‌సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు తినిపిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్



దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అదీప్ రాజ్

సబ్బవరం: అవినీతికి తావు లేకుండా.. పార్టీలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో మళ్లీ ప్రభుత్వాన్ని స్థాపిస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సబ్బవరంలోని మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్టీ 14వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ పార్టీ జెండా ఆవిష్కరించి అనంతరం మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద,బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అందించిన సంగతి మనందరికీ తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో పేదరికం ఉండకూడదని.. అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో రాజశేఖర్‌రెడ్డి పని చేశారన్నారు. ఆయన మరణాంతరం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబాన్ని అప్పటి కాంగ్రెస్ పార్టీ ఎన్ని ఇబ్బందులకు గురిచేసిందో అంతా చూశామన్నారు. అలాంటి తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్‌సీపీ స్థాపించారన్నారు. రాజశేఖర్‌రెడ్డి పాలన కొనసాగాలని, ఆయన ఇచ్చిన సంక్షేమ పథకాలు మళ్లీ ముందుకు వెళ్లాలనే ఆశయంతో స్థాపించిన వైఎస్సార్‌సీపీ 14 వసంతంలోకి అడుగుపెట్టడం చారిత్రాత్మకమన్నారు. ఒక ఎంపీ,ఒక ఎమ్మెల్యే తో మొదలైన పార్టీ అనేక ఒడిదొడుకులను.. అవమానాలను ఎదుర్కొంటూ ఈరోజు 151 ఎమ్మెల్యేలు, 22 ఎంపీలు,51 శాతం ఓటు షేర్ తో ధృఢమైన పార్టీగా ఆవిర్భవించిందన్నారు. నవరత్నాల ద్వారా అవినీతికి తావులేకుండా ప్రజలకు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2024లో కూడా అత్యధిక మెజార్టీతో ప్రభుత్వాన్ని స్థాపిస్తుందని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, సబ్బవరం, పెందుర్తి, పరవాడ మండల పార్టీ అధ్యక్షులు కర్రి బాబు, గొరపల్లి శ్రీను, కోన రామారావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొటాన రాము, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయలపూడి భగవాన్ జయరాం, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరం ముత్యాల నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రాము నాయుడు, వనం అచ్చెం నాయుడు, రాపేటి రాము, వార్డు అధ్యక్షులు దాసరి సత్తిబాబు, ఆదిరెడ్డి మురళి,పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు బంతికోళ్ల పద్మ, పార్టీ జిల్లా కార్యదర్శి దెడ్డం పద్మావతి, ఐడీ బాబు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు

కలెక్టర్ మల్లికార్జున



రోగులకు కల్పిస్తున్న వసతుల గురించి ఆరా తీస్తున్న కలెక్టర్ మల్లికార్జున

పెందుర్తి: పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. మంగళవారం పెందుర్తి సీహెచ్‌సీని కలెక్టర్ సందర్శించారు. రోగులతో మాట్లాడి ఇక్కడ అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. మరుగుదొడ్ల పరిశుభ్రత తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ విభాగంలో నాణ్యత కనిపించాలని ఆదేశాలు జారీ చేశారు. సిబ్బందికి పలు అంశాలపై సూచనలిచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అవంతిక, వైద్యుడు దొర, తహసీల్దార్ బంగార్రాజు కలెక్టర్ వెంట ఉన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

- నరవలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో రూ.55.70 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ ప్రారంభించారు.
- పెందుర్తి ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి అక్కడ అందుతున్న సౌకర్యాల గురించి విద్యార్థులను ఆరా తీశారు. నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. వసతి గృహం ప్రాంగణంలో మొక్కలు నాటారు. .
- నరవలో రూ.15 లక్షలతో నిర్మించిన ప్రత్యేక అవసరాల పిల్లల ఫిజియోథెరపీ కేంద్రాన్ని కలెక్టర్ మల్లికార్జున ప్రారంభించారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, డీఈవో చంద్రకళ, ఎస్ఎస్ఏ పీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఘన సత్కారం



వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని ఆరిపాక సచివాలయం వద్ద పార్టీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వలంటీర్లను ఎంపీపీ ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పారదర్శకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాలను వలంటీర్లు ద్వారా ప్రజల చెంతకే అందిస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో మండల కేంద్రాలకు దీటుగా సచివాలయాలు ఏర్పాటు చేశారని చెప్పారు. సమగ్ర రీ సర్వేలో భాగంగా అందించిన పట్టాదారు పాస్ పుస్తకాలను ఎంపీపీ రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీ లక్ష్మీరాణి, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు,మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, మాజీ సర్పంచ్ పాలిశెట్టి పైడిరాజు,ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,బి. మహలక్ష్మినాయుడు,బోను గంగునాయుడు,ఎన్‌పీ రాజు,బండారు రమణ,మళ్ల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చీమలాపల్లి కన్వెన్షన్ సెంటర్‌కు అదనపు నిధులు

రూ.2.60 కోట్లు విడుదల చేసిన వీఎంఆర్‌డీఏ



కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు కృతజ్ఞతలు తెలుపుతున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి నిధులతో జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి వద్ద నిర్మిస్తున్న అధునాతన కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం వీఎంఆర్‌డీఏ అదనపు నిధులు మంజూరు చేసింది. కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రతిపాదన మేరకు జిల్లా కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున రూ.2.60 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముమ్మన దేముడు మంగళవారం కలెక్టర్ మల్లికార్జునను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

అభినందన



కార్తికేయను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ స్వరూప

పెందుర్తి: నగరంలో ఇటీవల జరిగిన సర్ సి.వి. రామన్ యంగ్ జీనియస్ అవార్డు పోటీల్లో సుజాతనగర్ రవీంద్రభారతి పాఠశాల ఆరో తరగతి విద్యార్థి పి.కార్తికేయ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం కార్తికేయను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జీఎం కె.రమ్య, ప్రిన్సిపాల్ కె.స్వరూప అభినందించారు.

పెందుర్తి మసీదులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న డీసీపీ-2 సత్తిబాబును సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు

పెందుర్తి: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా పెందుర్తిలోని ఏ రజాయే ముస్తాఫా మసీద్‌లో మంగళవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. విందుకు హాజరైన నగర డీసీపీ-2 మేక సత్తిబాబు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. విందులో పాల్గొన్నారు. ముస్లిం పెద్దలు డీసీపీ-2 సత్తిబాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెందుర్తి సీఐ ఎల్.రామకృష్ణ, రాష్ట్ర ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ షఫీ ఉల్లా, మసీదు అధ్యక్షుడు షేక్ రహమాన్, సభ్యులు షేక్ కరీముల్లా, షేక్ ఇషాక్, షేక్ మదీనా తదితరులు పాల్గొన్నారు.

ఐఐఎం సమరంభ్‌లో విస్తం విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న విస్తం కళాశాల ప్రిన్సిపాల్ శివకుమార్

పెందుర్తి: ఐఐఎం ఆధ్వర్యంలో నగరంలో ఇటీవల జరిగిన సమరంభ్ 8.0 డ్యాన్స్ పోటీల్లో మండలంలోని పినగాడి విస్తం కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. బీటెక్, డిప్లమో చదువుతున్న విద్యార్థుల బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి శివకుమార్ విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టీపీవో కిరణ్‌కుమార్, కళాశాల అంబాసిడర్ కె.షారు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ సభను విజయవంతం చేయాలి



ప్రసంగిస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఈ నెల 15న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన పోరాట కమిటీ సమావేశంలో నాయకులు మాట్లాడారు. ప్లాంట్ పరిరక్షణ కోసం మూడేళ్ల నుంచి కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నామని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా ముందుకు వచ్చిందని అన్నారు. ఇందులో భాగంగా త్రిష్నా మైదానంలో ఆ రోజు సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న సభకు తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిల హాజరవుతున్నందున ఉక్కు ఉద్యోగులు, నిర్వాసితులు తమ కుటుంబ సభ్యులతో సభకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, వై.మస్తానప్పు, జి.గణపతిరెడ్డి, జె.ర్రిపోతుల ముత్యాలు, డి.వి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రతతో ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్

అగనంపూడి: పరిశ్రమల యాజమాన్యాలు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాల నివారణకు అవకాశం ఉంటుందని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్ అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలోని సినర్జీస్ కంపెనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల పెద్ద ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలే ఎక్కువగా ఉంటాయని, నిర్లక్ష్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. భద్రత విషయంలో యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం కార్మికులు భద్రతా ప్రమాణం చేశారు. తరువాత వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.సుధాకర్, సినర్జీస్ జీఎం రమేష్‌బాబు, జీఎం చంచల్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమా వ్యాధిపై అవగాహన అవసరం

కంటి వైద్యుడు డాక్టర్ రవీంద్ర



గ్లకోమా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ రవీంద్ర, వైద్యులు

సింహాచలం: గ్లకోమా అనేది నిశ్శబ్దంగా కంటి చూపును అపహరించే ప్రమాదకర వ్యాధి అని, ఈవ్యాధిపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ రవీంద్ర తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో మంగళవారం నుంచి ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆస్పత్రి నుంచి వేపగుంట వరకు పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ గ్లకోమా వ్యాధి నివారణకు ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శంకర్ ఫౌండేషన్‌లో అన్ని రకాల కంటి శస్త్ర చికిత్సలకు మెరుగైన వైద్యం అందిస్తోందని తెలిపారు.కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లక్ష్మి, డాక్టర్ మంజువల్లి, డాక్టర్ కవితాదేవి, డాక్టర్ సవర్ణ, డాక్టర్ శశి, డీజీఎం కె.బంగార్రాజు,ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి విముక్తి కలిగించాలని ఆందోళన



బూడిద లారీలను అడ్డగించిన గ్రామస్తులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ బూడిద చెరువుల నుంచి రాకపోకలు సాగిస్తున్న ఫ్లైయాష్ లారీల ద్వారా విడుదలవుతున్న కాలుష్యం నుంచి తమకు విముక్తి కలిగించాలని దేశపాత్రునిపాలెం గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. బూడిద లారీల నుంచి విడుదలవుతున్న కాలుష్యాన్ని అరికట్టాలని కోరుతూ మంగళవారం దేశపాత్రునిపాలెం నాలుగు రోడ్ల కూడలిలో అఖిల పక్షం ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బూడిద చెరువుల మీదుగా రాకపోకలు సాగిస్తున్న లారీలను గ్రామస్తులు అడ్డగించారు.

ఫలితంగా రెండు గంటల పాటు కారిడార్ రహదారిలో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఓవర్‌లోడుతో కారిడార్ రహదారిలో ప్రయాణిస్తున్న బూడిద లారీల కారణంగా బూడిద ఎగిసిపడి తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నామని ఆరోపించారు. నిత్యం కారిడార్ రహదారిలో లెక్కకు మించి ప్రయాణిస్తున్న బూడిద లారీల కారణంగా రైల్వే వంతెన సమీపంలో.. నాలుగు రోడ్ల కూడలి వద్ద ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కావడంతో స్కూల్ బస్సులు, ప్రయాణికుల వాహనాలు ట్రాఫిక్‌లో నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫ్లైయాష్ లారీల కాలుష్యాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్కూల్ బస్సులు ఇతర ముఖ్యమైన వాహనాల రాకపోకలకు వీలు కల్పించే విధంగా ఉదయం 7.30 నుంచి 9.30 వరకు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు బూడిద లారీల రాకపోకలను నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆందోళన సమాచారం అందుకున్న సీఐ ఎస్.బాలసూర్యారావు ఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. లారీల యాజమాన్యాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు నిరసన విరమించారు.

ఎన్నికల ప్రక్రియలో ఐటీ సభ్యుల పాత్ర కీలకం



యాప్ కోసం వివరిస్తున్న ఎన్ఐసీ అధికారి, శిక్షణలో పాల్గొన్న జేసీ మయూర్ అశోక్, ఏడీసీ విశ్వనాథన్ ,

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ఐటీ సభ్యుల పాత్ర చాలా కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. ఐటీ అప్లికేషన్స్, యాప్స్ వినియోగం, తదితర అంశాలపై వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వివిధ విభాగాల నుంచి ఎంపికైన ఐటీ టీం సభ్యులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్‌తోపాటు పాల్గొన్న జేసీ పలు అంశాలపై మాట్లాడారు. ఐటీ టీం సభ్యులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ ఏం జరిగినా జిల్లా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. ఎన్నికల నియమావళి దాటి ఎవరు ప్రవర్తించినా, ఉల్లంఘనలకు పాల్పడినా సీ విజిల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులు, ఇతర అంశాలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఐటీ అప్లికేషన్లు, సి.విజిల్ యాప్ వినియోగంపై ఎన్ఐసీ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డెమో ఇచ్చారు. ఏఆర్వోలు, ఏఈఆర్వోలు, ఐటీ బృంద సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: అన్నింటా నైపుణ్యాలు పెంపొందించుకునే దిశగా యువత నడవాలని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఈసీఈ విభాగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సమర్థత దిశగా విద్యార్థులు అడుగులు వేయాలన్నారు. మార్పులను స్వీకరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. అవధులు లేని అవకాశాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. గత నాలుగేళ్ల కాలంలో ఏయూను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. ప్రతీ విభాగంలో 80 శాతం మందికిపైగా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ ఏయూని ప్రపంచంతో కనెక్ట్ చేసే బాధ్యత విద్యార్థులదేనన్నారు. సాంకేతికత అవసరం, ప్రాధాన్యతను తెలుసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ ప్రయోగశాలల అభివృద్ధికి అవసరమైన నిధులను ఏయూ అందించి, పూర్తి స్థాయిలో ఆధునీకీకరించిందన్నారు. ప్రాజెక్టులు, పేటెంట్లపై విభాగం ఆచార్యులు దృష్టి సారించాలన్నారు.

స్టీల్‌ప్లాంట్ సీఎల్‌సీ అధికారులకు సత్కారం



సీఎల్‌సీ అధికారులను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ సెల్ (సీఎల్‌సీ) అధికారులను విశాఖ ఉక్కు శ్రామిక సంఘం నాయకులు సత్కరించారు. ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ (ఈఎస్ఎఫ్) విభాగంలో కాంట్రాక్ట్ చేస్తున్న జె.ఆర్.కన్‌స్ట్రక్షన్ యజమాని మరణించడంతో ఆ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రెండున్నరేళ్ల పాటు ఫుల్ అండ్ ఫైనల్ బెనిఫిట్స్ నిలిచిపోయాయి. కార్మికులకు రావాల్సిన ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్‌మెంట్ కోసం సీఎల్‌సీ డీజీఎం ఖర్, ఈఎస్ఎఫ్ డీజీఎం కె.శ్రీనివాసరావు, హెచ్‌ఆర్ డీజీఎం అరుణ, సీఎల్‌సీ సిబ్బంది సూర్యనారాయణ శ్రమించి ఉక్కు యాజమాన్యమే ఇచ్చేలా కృషి చేశారు. ఈ సందర్భంగా ఖర్, సూర్యనారాయణతో పాటు సీఎల్‌సీ సిబ్బందికి మంగళవారం వారు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొడ్డు పైడిరాజు, కరణం సత్యారావు, ఎం.కోటేశ్వరరెడ్డి, బొడ్డు రమణ, పి.పెంటారావు, కె.వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలి ఓటు వేసేందుకు సిద్ధం



ఓటు వేయడానికి సిద్ధం అంటూ ఆసక్తి వ్యక్తం చేస్తున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

పెందుర్తి: జాతీయ సాంకేతిక విద్యాశాఖ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఓటు హక్కు వినియోగం..సమాజానికి ఉపయోగం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశ పౌరునిగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని చెప్పారు. ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. 'ఓటు వేసేందుకు సిద్ధం' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వి.వి. నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.